
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.5
కనిష్ఠం 23.0

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

3

శనివారం 13 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.90 (311.7462)	1,00,979	1,00,979
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,137.95	633.70
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.587 (43.5968)	82,320	1,30,542

చికెన్ ధరలు | లైవ్ : రూ.149 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260

వర్షాలతో పత్తి రైతుల్లో గుబులు



వరుస వర్షాలతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. రానున్న మూడురోజుల పాటు భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. జిల్లా లో రైతులు వరి తర్వాత అత్యధికంగా పత్తిని సాగుచేశారు. ప్రస్తుతం పత్తి కాయ దశకు వచ్చింది. అయితే వరుసగా వర్షాలతో పంట దెబ్బ తింటుందని పత్తి రైతుల గుండెల్లో దడ మొదలైంది.
- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

- పంట ఎదుగుతున్న దశలో దెబ్బతీస్తున్న వర్షాలు
- ఇప్పటి వరకు 1.15లక్షల ఎకరాల్లో తెల్లబంగారం సాగు

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 4.40లక్షల ఎకరాల్లో వరి, పత్తి, తదితర పంటలు సాగయ్యాయి. 2.95లక్షల ఎకరాల్లో వరి, 1.15 లక్షల ఎకరాల్లో పత్తిని రైతులు సాగుచేశారు. మూసీ పరివాహక ప్రాంతం మినహాయించి మిగతా ప్రాంతాల్లో అధికంగా పత్తి సాగైంది. సీజన్ ప్రారంభంలో జూన్, జూలైలో నాటిన పత్తితో పాటు జొన్న, కూరగాయల పంటలకు సరిపడా నీరందలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆరుతడి పంటలు జీవం పోసుకున్నాయి. భారీ వర్షాలకు పంటలు పచ్చగా మారి ఏపుగా ఎదుగుతున్నాయి. కాగా, రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆందోళన మొదలైంది. భువనగిరి, ఆలేరు, రాజపేట, మోటకొండూరు, యాదగిరిగుట్ట, తుర్కపల్లి, గుండాల, ఆత్మకూరు, మోత్కూరు, తదిత ర మండలాల్లో అధికంగా పత్తి సాగైంది. భారీ వర్షాలతో పత్తి పొలాల్లోకి నీరు చేరింది. భువనగిరి మండలంలోని వీరవెల్లి, చందుపట్ల, తదితర గ్రామాల్లో భారీ వర్షాలకు చేలల్లోకి నీరు చేరడంతో లోతట్టు ప్రాంతాల్లోని మొక్కలు మునిగి చనిపోయాయి. పత్తి పంట ఆశాజనకంగా ఎదుగుతున్న తరుణంలో వరుస వర్షాల తో దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కలుపు ఏపుగా పెరగడంతో రైతులపై ఆర్థిక భారం పడింది. వరుస వర్షాల కారణంగా చీడపీడలు ఆశించి పూత, కాతపై



వీరవెల్లిలో నీటిలోనే పత్తి మొక్కలు

ప్రభావం చూపే అవకాశం ఉంది. పలు ప్రాంతాల్లో కాయలు సైతం తెరిపి లేని వర్షాలకు మురిగిపోతున్నాయి. విరబూసిన దుది పింజలు తడిసి ముద్దవుతున్నాయి. పంట ఎర్రబడి ఆకులు రాలి పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా ఎకరాకు 10 నుంచి 12క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుంది. అధిక వర్షాలు ఇలాగే కురిస్తే పంట దిగుబడి కూడా తగ్గే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలోని బీబీనగర్, భువనగిరి, వలిగొండ మండలాల్లో వరి పంట నేలవాలింది. అధికారులు మాత్రం కేవలం

- మిగతా 6వ పేజీలో...

వర్షంతో ఆలేరు అతలాకుతలం



ఆలేరు రంగ నాయక వీధి లో ఓ ఇంట్లోకి చేరిన వరద

ఆలేరురూరల్/ ఆలేరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి కారణంగా గురువారం సాయంత్రం ఆలేరులో కుండపోత వర్షం కురిసింది.దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆలేరులోని 1వ వార్డు, 11, 12వ వార్డులు, పాత మునిసిపల్ కార్యాలయం, రంగనాయకవీధి, కుమ్మరివాడ, సిల్క్‌నగర్, క్రాంతినగర్‌లోని పలుఇళ్లలోకి వరద నీరువచ్చి చేరింది. ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు,గృహోపకరణాలు నీట మునిగాయి.నాలాలు,మురుగు కాల్వలు, రైల్వే ట్రాక్ కింద ఉన్న డ్రైనేజీల్లో చెత్తా చెదారం పేరుకుపోవడం, మిషన్ భగీరథ పైపులు నీటి ప్రవాహానికి అడ్డంగా ఉండడంతో వరద ఇళ్లలోకి చేరింది. దీంతో మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఎక్స్‌కవేటర్ సహాయంతో అర్ధరాత్రి చెత్తాచెదారాన్ని తీయించడంతో వరద ప్రభావం తగ్గింది. వీధులన్నీ జలమయమవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. పర్రెకాల్వ, భైరాం కుంటలు అలుగుపోయడంతో ఉధృతి పెరిగింది. ఊట్కూరి కిష్టయ్య, మహ్మద్ అన్వర్, బద్రుద్దీన్ జహంగీర్ ఇంటి గోడలు కూలాయి. ప్రహరీ కూలడంతో పుట్ట నవీన్‌కు చెందిన అశోక్ లేల్యాండ్ వాహనం దెబ్బతిన్నది. మహ్మద్ అన్వర్, తోట కమలమ్మ, వంగరి శివకుమార్, హరికుమార్ ఇళ్లలో నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు పూర్తిగా తడిచాయి. పుస్తకాలు సైతం తడిచాయని బీటెక్ చదువుతున్న సాహిష్త, ఇంటర్ చదువుతున్న మహీం ఫాతిమా తెలిపారు. అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, ఆర్డీవో కృష్ణారెడ్డి, తహసీల్దార్ ఆంజనేయు, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, సీఐ యాలాద్రి పట్టణంలోని ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. వర్షంతో ఇబ్బందులు ఎదుర్కొన్న బాధిత 50 కుటుంబాలకు బీఆర్ఎస్ రాష్ట్ర నేత కల్లూరి రాంచంద్రారెడ్డి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. మల్లెల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్లెల శ్రీకాంత్ బాధితులకు అన్నదానం చేశారు.

మూసీకి పెరిగిన వరద ఉధృతి

(ఆంధ్రజ్యోతి, బీబీనగర్, వలిగొండ): హైదరాబాద్ పరిసరా ప్రాంతాల్లో గురువారం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి దిగువన ఉన్న మూసీకి వరద ఉధృతి పెరిగింది. హైదరాబాద్ ఎగువ ప్రాంతాల నుంచి జలాశయాలకు భారీ స్థాయిలో వరద నీరు వచ్చి చేరుతుండడంతో హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో జిల్లాలోని బీబీనగర్ మండలంలో మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. బీబీనగర్-భూదాన్‌పోచంపల్లి మార్గంలో రుద్రవెల్లి-జూలూరు మధ్య లోలెవల్ బ్రిడ్జి పైనుంచి నాలుగు అడుగుల ఎత్తులో మూసీ ప్రవహిస్తోంది. దీంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. బ్రిడ్జికి రెండువైపులా బారీకేడ్లను అడ్డుగా పెట్టి వాహనాదారులు వాగు దాటకుండా పోలీసు, రెవెన్యూ సిబ్బంది కాపలా ఉన్నారు. ఈ మార్గంలో రోజంతా రాకపోకలు నిలిచిపోవడంతో రెండు మండలాలకు చెందిన 20గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రయాణికులు మక్తానంతారం, పిలాయిపల్లి, భట్టుగూడెం, పెద్దరావులపల్లి రోడ్డు మార్గం నుంచి హైదరాబాద్, భువనగిరి వైపు రాకపోకలు కొనసాగించాల్సి వచ్చింది. మరో రెండు రోజుల పాటు వర్షాలు ఉండడంతో మూసీకి వరద ఉధృతి కొనసాగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. వలిగొండ మండలం సంగెం పరిధిలోని భీమలింగం వద్ద మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. గురువారం అర్ధరాత్రి నుంచి నీటి ప్రవాహం పెరగడంతో సంగెం-బొల్లపల్లి

- మిగతా 6వ పేజీలో...

ఆలేరును సస్యశ్యామలం చేయడమే లక్ష్యం

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



చెరువును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

ఆలేరు రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన లక్ష్యమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని మందనపల్లి, టంగుటూరు, సాయిగూడెం గ్రామాల చెరువులను పరిశీలించి మాట్లాడారు. సాయిగూడెం, మందనపల్లి గ్రామాల మధ్య ఉన్న కెనాల్ ఫీడర్ చానెల్ ద్వారా మందనపల్లి చెరువును నింపుకోవచ్చన్నారు. పెద్ద కాల్వనుంచి ఎలాంటి కాల్వ లేనందున వర్షం నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నందున, ఈ ఫీడర్ చానెల్ ద్వారా నిల్వ ఉన్న నీటిని చెరువులోకి పంపవచ్చన్నారు. ఈ మందనపల్లి చెరువు నింపితే సాయిగూడెం, కందిగడ్డతండా, టంగుటూరు శారాజీపేట, రైతుల భూములకు సాగునీరు చేరుతుందన్నారు. ఆయనవెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రాజు, తుంగకుమార్, కంతి నాగరాజు, శ్రీనివాస్, శ్రవణ్ ఉన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టిసారించాలి

కలెక్టర్ హనుమంతరావు



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు, పాల్గొన్న డీఎంహెచ్‌వో మనోహర్, డీఆర్డీవో నాగిరెడ్డి

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటే దేశం బాగుంటుందని, వారు ఆరోగ్యంపై దృష్టి సారించాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌పై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, తదితర శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. మహిళల ఆరోగ్యం కోసం ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుందని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో గ్రామ స్థాయినుంచి మున్సిపాలిటీలవరకు నిర్వహించే ఈకార్యక్రమంలో స్పెషలిస్టు వైద్యులు చికిత్స అందజేయనున్నారని తెలిపారు. మాతా శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతోపాటు మహిళలకు వచ్చే వివిధ రకాల క్యాన్సర్ సంబంధిత వ్యాధులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి పరీక్షలను నిర్వహిస్తామన్నారు. మహిళలు స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మనోహర్ మాట్లాడుతూ ఆడపిల్లలు, మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి వ్యాధులు సోకకుండా జాగ్రత్త వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పక్షం రోజులు జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమీక్షలో ఎయిమ్స్ అదనపు డైరెక్టర్ కళ్యాణి, జడ్పీ సీఈవో శోభారాణి, డీసీహెచ్ఎస్ చిన్నానాయక్, డీఆర్డీవో నాగిరెడ్డి, డీఈవో సత్యనారాయణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో యశోద, నరసింహారావు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండలంలోని కూరెళ్ల పల్లె దవాఖానాలో ఎంఎల్‌హెచ్‌పీ(పల్లెడాక్టర్)గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అశోక్‌ను సస్పెండ్ చేయాలని డీఎంహెచ్‌వోను కలెక్టర్ హనుమంతరావు ఆదేశాలు జారీచేశారు. కలెక్టర్ కూరెళ్ల పల్లె దవాఖానాను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆ సమయంలో దవాఖానాలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ అశోక్, ఏఎన్‌ఎం రాములమ్మ లేరు. ఆశా కార్యకర్త కళమ్మ ఒక్కరే ఉన్నారు. డాక్టర్, ఏఎన్‌ఎంలు ఎటు వెళ్లారని ఆశా కార్యకర్తను కలెక్టర్ అడిగారు. ఏఎన్‌ఎం ఆత్మకూరు పిహెచ్‌సీకి వెళ్లారని, డాక్టర్ గురించి తనకు తెలియదని సమాధానం చెప్పారు. అనంతరం ఓపీ రిజిస్టర్ పరిశీలించారు. డాక్టర్ చాలా రోజుల నుంచి విధులకు హాజరు కావడంలేదని గ్రామస్థులకు కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో కలెక్టర్ ఎలాంటి సమాచారం లేకుండా విధులకు హాజరుకాని కూరెళ్ల ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ అశోక్‌ను సస్పెండ్ చేయాలని జిల్లా వైద్యాధికారి మనోహర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల బిల్లల చెల్లింపులో ఎంపీడీవో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కూరెళ్ల గ్రామస్థులు ఆరోపించడంతో, ఎంపీడీవో రాములు నాయక్‌ను కలెక్టర్ మందలించారు. అనంతరం మండలకేంద్రంలోని ఆత్మకూరు-మొరిపిరాల బిక్కేరు వాగును కలెక్టర్ పరిశీలించారు.

ఆధార్ హాజరుకు మినహాయింపు ఇవ్వాలి

మెడికల్, హెల్త్ జేఏసీ వినతి




డీఎంహెచ్‌వో మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మెడికల్, హెల్త్ జేఏసీ నాయకులు

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో వైద్య, ఆరోగ్య పర్యవేక్షణ సిబ్బందిని ఆధార్ ఆధారిత (అబాస్) హాజరునుంచి మినహాయించాలని తెలంగాణ మెడికల్ హెల్త్ జేఏసీ రాష్ట్ర స్పోర్ట్స్ కార్యదర్శి మురళీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌వో మనోహర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జిల్లాలో 5 నుంచి 25 కిలోమీటర్ల పరిధిలో ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో 4నుంచి 10 సబ్‌సెంటర్లు ఉన్నాయని,పీహెచ్‌సీకి వెళ్లి హాజరు నమోదు చేసుకుని విధులు నిర్వహించడం ఇబ్బందిగా మారిందన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని క్షేత్రస్థాయి వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టీఎంహెచ్‌జేఏసీ స్టేట్ స్పోర్ట్స్ జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్,టీఎన్జీవో జిల్లాఅధ్యక్షుడు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

మోత్కూరును నియోజకవర్గం చేయాలి


బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీసీరిజర్వేషన్ సాధన సమితి నాయకులు

మోత్కూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో మోత్కూరు మండలాన్ని అసెంబ్లీ నియోజకవర్గం చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. మోత్కూరును నియోజకవర్గం చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన దశలవారీ ఉద్యమంలో భాగంగా శుక్రవారం మోత్కూరులో ప్లకార్డులతో నిరసన తెలిపి మాట్లాడారు. పాత తాలూకా, పంచాయతీ సమితి కేంద్రమైన మోత్కూరును నియోజకవర్గం చేయాలన్నారు. 2009 అసెంబ్లీ ఎన్నికల ముందు జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలోనే మోత్కూరు నియోజకవర్గం కావాల్సి ఉండగా, అప్పుడు ఈ ప్రాంత నాయకులు తగిన చొరవ చూపని కారణంగా రామన్నపేట రద్దయి, మోత్కూరు నియోజకవర్గం కాకుండా పోయిందన్నారు. మోత్కూరు, ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు, మోటకొండూరు మండలాలకు కేంద్రంగా ఉన్న మోత్కూరును నియోజకవర్గం చేసినట్లయితే వెనుకబడిన ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. మోటకొండూరు మండలంలో ఉన్న గ్రామాలు గతంలో ఆత్మకూరు(ఎం) మండలంలో ఉన్నవేనన్నారు. నియోజకవర్గం ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పక్షాల నాయకులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నోముల రమేష్, కొయ్యలకారి జహంగీర్, మర్రి కమల్‌నాథ్, చాపల అంజయ్య, మర్రి ఆనందం, బోయిన ఉప్పలయ్య, కనుకు రాజు, ఎర్రవెల్లి స్వామి, మల్లయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

● ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్చాల్సిందే



ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట విపక్ష నాయకులు చేస్తున్న ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకట్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు

4

ఎరుపు అంటేనే కేంద్రానికి భయం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



భువనగిరిలో సంస్మరణ సభలో నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ప్రభుత్వ విప్ అయిలయ్య, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి గంజ్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మోదీకి, కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షాకు ఎరుపు అంటే భయం పట్టుకుందని, దేశంలో కమ్యూనిస్టులు లేకుండా చేయడానికి 'కగార్' పేరిట మావోయిస్టులను హతమారుస్తోందని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ఎర్రజెండానే పేదలకు అండ అని, ఆ జెండాను కాపాడుకుంటేనే మానవాళిని ముందుకు నడిపిస్తుందని అన్నారు. పేదవాడికి సాయం చేయడానికి హక్కులు సాధించపెట్టడానికి అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడేది ఎర్ర జెండా మాత్రమే అని అన్నారు. రాబోయే రోజుల్లో ఖిల్లాపై ఎర్రజెండా ఎగురవేయడమే సురవరానికి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బాల్యం నుంచి తుది శ్వాస వరకు కమ్యూనిస్టుగా విలువలతో కూడిన జీవితాన్ని గడిపిన సురవరం జీవితం నేటి తరం నాయకులకు ఆదర్శప్రాయంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ పేద ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన సురవరం ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం నిజమైన నివాళులని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేలు, సీపీఐ జాతీయ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండీ.జహంగీర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, గోద శ్రీరాములు, బోలగాని జయరాములు, రాచకొండ జనార్దన్, చేడే చంద్రయ్య, కురిమిద్ది శ్రీనివాస్, ఇమ్రాన్, అశోక్, జంగమ్మ, ముత్యాలు, మహేందర్, దాసరి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

సెమినార్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత

జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సైన్స్ అధికారి రాజశేఖర్

భువనగిరి టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సెమినార్‌తో విద్యార్థుల్లో అవగాహన సామర్థ్యం, సృజనాత్మకత పెరుగుతాయని జిల్లా సైన్స్ అధికారి పి.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం భువనగిరిలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. సెమినార్‌లో పాల్గొనే విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. నేడు ప్రతిభ, ఆసక్తి ఉన్న విద్యార్థులే భవిష్యత్ శాస్త్రవేత్తలని అన్నారు. విద్యార్థుల ఆలోచన శక్తి, వివేచనాశక్తి, సృజనాత్మకతకు సెమినార్స్ దర్పణం పడతాయని అన్నారు. రాష్ట్రస్థాయి సెమినార్‌లో జిల్లా ప్రతిభను చాటాలని విద్యార్థులకు సూచించారు. ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రమేష్, సలీం, ప్రభాకర్, లింగేశ్వర్, వేణుగోపాల్, జితేందర్‌రెడ్డి, శారద, విజయ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్ పోటీల విజేతలు

జిల్లాస్థాయిసెమినార్ పోటీల్లో మొదటి బహుమతి సాధించిన రామన్నపేట కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన రీమిషా సదాఫ్ 18న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి సెమినార్ పోటీలకు అర్హత సాధించారు. ప్రగతి (టీజీఎంసీ, గుండాల) ద్వితీయ, వివేక్‌వర్ధన్ (భాగయాత్ ఉన్నత పాఠశాల, భువనగిరి) తృతీయ బహుమతి సాధించారు.



లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు

నేడు జాతీయ లోక్‌అదాలత్

- జిల్లా కోర్టులలో ఎనిమిది బెంచ్‌ల ఏర్పాటు
- పరిష్కారానికి సుమారు 10వేల కేసుల గుర్తింపు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులకు స్నేహపూర్వక పరిష్కారం, కోర్టులపై కేసుల భారం తగ్గింపు లక్ష్యంతో శనివారం దేశ వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ జరుగనుంది. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్వహిస్తున్న మూడో జాతీయ లోక్ అదాలత్ కాగా, జిల్లాలోని కోర్టుల్లో ఎనిమిది బెంచ్‌లను ఏర్పాటుచేశారు. క్రిమినల్ కేసులు మినహా పరస్పర రాజీతో పరిష్కరించుకునే సుమారు 10వేల కేసులను అధికారులు గుర్తించారు. సివిల్, ఎక్సైజ్, ట్రాఫిక్ చలానా, బ్యాంకు రుణ వాయిదాల చెల్లింపు, బీఎస్ఎన్ఎల్ బిల్లు చెల్లింపు, చిట్ ఫండ్ తదితర కేసులను పరిష్కరించుకోవచ్చు. ఇందుకోసం కోర్టులవారీగా ఇది వరకే ప్రీసిట్టింగ్స్ నిర్వహించారు. ఈమేరకు కక్షిదారులు సకాలంలో సంబంధిత కోర్టులకు చేరుకొని కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు జయరాజు, మాధవిలత సూచించారు. ఈ మేరకు న్యాయమూర్తులు, అధికారులతో శుక్రవారం భువనగిరిలోని జిల్లాకోర్టుల్లో జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్షించి పలు సూచనలు చేశారు.



సీతారాంపురం పీఏసీఎస్ కార్యాలయం వద్ద నిద్రిస్తున్న రైతులు

యూరియా కష్టాలు తీరేదెప్పుడో..!

భానుపురి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట పట్టణంలోని సీతారాంపురంలో రైతులు గురువారం రాత్రి పీఏసీఎస్ కార్యాలయం వద్ద నిద్రించారు. శుక్రవారం ఉదయం క్యూలో ఉండి యూరియాను తీసుకువెళ్లారు. రోజు వారీగా యూరియా వస్తుందని ఏవో సందీప్ తెలిపారు. రైతులు పెద్దసంఖ్యలో రావడంతో గందరగోళం నెలకొంది.

మేళ్లచెర్వు: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులోని పీఏసీఎస్‌కు 400 బస్తాల యూరియా విలువలు వచ్చాయనే సమాచారంతో రైతులు వేకువజాము నుంచి భారీ సంఖ్యలో వచ్చారు. ఒక్కో రైతుకు రెండు యూరియా కట్టలు, అర లీటర్ నానో యూరియా డబ్బా అందజేశారు. చొప్పున స్టాకు ఉన్నంత వరకు పోలీసులు పహారాలో అందజేశారు. దొరకని రైతులు నిరాశతో వెనుదిరిగారు.

పంపిణీ ఇలాగేనా..

మోతె : సూర్యాపేట జిల్లా మోతె మండలంలో తెల్లవారుజాము నుంచే క్యూలైన్‌లో నిలబడుతున్నారు. సిరికొండ, సర్వారం సొసైటీల ద్వారా వస్తున్న యూరియా బస్తాలు మండలంలో పరపతి ఉన్న వారికే ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. శుక్రవారం నామవరంలో సిరికొండ సొసైటీ ఆధ్వర్యంలో లారీలోడ్ రాగా వెయ్యి మందికి పైగా మహిళా రైతులు, రైతులు తెల్లవారక ముందే లైన్‌కట్టారు. యూరియా పంపిణీ చేయడంలో ఆలస్యం కావడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌ఐ అజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి లైన్‌లో ఉన్నవారికి ఒక్క కట్టచొప్పున అందజేశారు.

మఠంపల్లి: మండలకేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఏవో రైతులతో ఫోన్‌లో మాట్లాడారు. ఉన్నతాధికారులతో మాట్లాడి రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో యూరియా అందుబాటులో వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమింపజేశారు.

● రైతులకు న్యాయం చేయలేకపోతున్నామని మఠంపల్లి పీఏసీఎస్ డైరెక్టర్లు గోలి చంద్రం, పట్టేటి అంతోని, పశ్య రామనర్సమ్మ, వల్లపుదాసు లింగయ్య రాజీనామా చేశారు.

తుంగతుర్తి : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలకేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రానికి వెయ్యి బస్తాల యూరియా వచ్చింది. రైతులు వేకువజాము నుంచే పీఏసీఎస్ వద్ద క్యూ కట్టారు. తాము ఇళ్లకు వెళ్లిన తర్వాత రాత్రిపూట టోకెన్లు ఇస్తున్నారని రైతులు అంటున్నారు. కొంతమంది రైతులు కలిసి బస్తాలు తీసుకొని ఒకే ఆటోలో వేసుకొని వెళ్ళడానికి ప్రయత్నం చేస్తే రైతులు అడ్డుకొని ఆందోళన చేశారు. ఆటోను ఆపివేసి ఒకరికి ఇన్ని బస్తాలు ఎలా ఇస్తారని అడ్డుకున్నారు.



తుంగతుర్తిలో ఆందోళన చేస్తున్న రైతులు



నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలకేంద్రంలో రాస్తారోకో చేస్తున్న రైతులు, మిర్యాలగూడ వైపు నిలిచిన వాహనాలు

ఆగ్రహం 'కట్టలు' తెగుతోంది

● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యూరియా కోసం రైతుల ఆందోళన ● గంటల కొద్దీ క్యూలో ఉన్నా దొరకని యూరియా

రైతుల ఆగ్రహం కట్టలు తెగు తోంది. రోజుల తరబడి యూరియా కోసం తిరుగుతున్నా దొరకడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిద్రాహారాలు మాని వస్తున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శుక్రవారం పలు చోట్ల అన్నదాతలు రోడ్డెక్కారు.

తిప్పర్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతను నిరసిస్తూ తిప్పర్తి మండల రైతులు నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలోని అద్దంకి-నార్కట్‌పల్లి జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. వారం రోజులుగా యూరియా కోసం తిరుగుతున్నా రేపు వస్తాయంటూ ప్రతిరోజూ అదే సమాధానం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా ఇచ్చేందుకు అధికారుల నుంచి హామీ వచ్చేంత వరకు రాస్తారోకో విరమించేది లేదంటూ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. సుమారు 45నిమిషాల పాటు రోడ్డుపైనే బైఠాయించారు. రహదారిపై మిర్యాలగూడ వెళ్లేదారిలో ఐదుకిలోమీటర్ల మేర, నల్లగొండ వైపు మూడు కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు నిలిచాయి. కలెక్టర్ రావాలంటూ మరి కొంతమంది రైతులు నినాదాలు చేయడంతో స్థానికంగా ఉన్న మండల వ్యవసాయ శాఖ అధికారి సన్నిరాజు, తిప్పర్తి ఎస్‌ఐ శంకర్ అక్కడికి చేరుకొని రెండు లారీల యూరియా వస్తుందని, అందుకు తగిన టోకెన్లు తీసుకోవాలని సూచించడంతో రైతులు అక్కడి నుంచి వెళ్లారు. టోకెన్లు తీసుకోవాలని చెప్పిన అధికారులు నకిరేకల్ రోడ్డులోని రైతు వేదిక వద్ద లైనులో ఉండాలని సూచించారు. 500లకు పైగా రైతులు లైన్‌లో వేచిఉండగా అదుపు చేయలేక టోకెన్లు ఇవ్వడం ఆలస్యమైంది. దీంతో రైతులు మూడు గంటలకు పైగా క్యూలైన్‌లో వేచి ఉన్నారు.

చందంపేట: చందంపేటలో యూరియా కోసం రైతులు రైతువేదికలు, పీఏసీఎస్ కేంద్రాల వద్ద క్యూలు కడుతున్నారు. 220 బస్తాల యూరియా మాత్రమే అందుబాటులో ఉండటంతో ఒక్కో రైతుకు బస్తా చొప్పున పంపిణీ చేశారు.

కొండమల్లేపల్లి:కొండమల్లేపల్లిలో తెల్లవారుజాము నుంచి రైతులు యూరియా కోసం పడిగాపులు కాశారు. నాలుగు రోజుల క్రితం రైతులకు 800టోకెన్లు జారీ చేసినప్పటికీ యూరియా అందజేయలేకపోయారు. దీంతో ఆగ్రహించిన రైతులు పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్‌రెడ్డి, ఏవో జానకిరాములతో వాగ్వాదానికి దిగారు. శుక్రవారం రెండు లారీల యూరియా రావాల్సిఉండగా ఒక లారీ మాత్రమే వచ్చిందని, మరోలారీని పెండ్లిపాకల గ్రామానికి ఎలా పంపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

యూరియా కోసం తోపులాట

పెద్దఅడిశర్లపల్లి: నల్లగొండ జిల్లా పీఏపల్లి సింగిల్ విండో కార్యాలయం, గుడిపల్లి రైతు వేదిక, రెండు ఆగ్రో రైతు కేంద్రాలకు యూరియా వచ్చిందని తెలియడంతో రెండు మండలాల రైతులు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. మధ్యాహ్నం వరకు రైతులు క్యూలైన్‌లోనే నిరీక్షించారు. తమవంతు ఎప్పుడు వస్తుందా అని నిద్రాహారాలు మాని పడిగాపులు కాశారు. సహనం నశించిన రైతుల మధ్య ఒక్కసారిగా తోపులాట జరిగింది. దీంతో పోలీసులు అక్కడి చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు. పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేశారు.

డిండి: యూరియా కోసం 400 మందికిపైగా రైతులు నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద బారులు తీరారు. మరికొందరు గురువారం రాత్రి ఆటోల్లో మండలకేంద్రానికి చేరుకొని పీఏసీఎస్ కార్యాలయం వద్దే నిద్రించారు.



మోత్కూరులో బారులు తీరిన రైతులు

యూరియా కోసం తప్పని తిప్పలు

మోత్కూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులో ఓ ఎరువుల దుకాణానికి యూరియా లారీ వచ్చిందని తెలియగానే రైతులు భారీగా తరలివచ్చి క్యూలో నిల్చున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని సాఫీగా పంపిణీ చేయించారు. ఒక్కో రైతుకు సాగు విస్తీర్ణాన్ని బట్టి ఒకటి, రెండు బస్తాలు ఇచ్చారు. లోడ్ వచ్చిన రెండు గంటల్లోనే పూర్తిగా విక్రయించారు. కొందరికి యూరియా దొరక్కపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

మద్దిరాల: యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రైతులు మండల కేంద్రంలో ఆగ్రోస్, ఎన్‌డీటీసీ కేంద్రాల ముందు క్యూలైన్‌లో ఉన్నారు. రైతులు ఒకరికి ఒకరు తోసుకోవడంతో తుంగతుర్తి సీఐ నరసింహ ఆధ్వర్యంలో ఎస్‌ఐ వీరన్న సహకారంతో రైతులకు యూరియా పంపిణీ చేశారు.

క్యూలో సొమ్మసిల్లి..

ఆత్మకూరు(ఎస్): సాగు చేయడంకంటే రైతులకు యూరియా కష్టాలు ఎక్కువవుతున్నాయి. యూరియా వస్తుందని తెలియడంతో వివిధ గ్రామాల నుంచి రైతులు యూరియా పంపిణీ కేంద్రాల వద్ద గురువారం రాత్రి చేరుకొని మహిళలతో క్యూలైన్ కట్టారు. శుక్రవారం తెల్లవారు జామున వస్తుందని ఆయా గ్రామాల్లోని వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం జరగడంతో ఆత్మకూర్(ఎస్), పీఏసీఎస్ కేంద్రాల వద్ద రైతులు తండోపతండాలుగా వచ్చి క్యూలైన్‌లో కూర్చున్నారు. ఆత్మకూర్(ఎస్) కేంద్రానికి శుక్రవారం యూరియా రాకపోవడంతో సాయంత్రం 4గంటల వరకు ఎదురుచూసి వెనుదిరిగారు. ఏపూర్ పీఏసీఎస్ కేంద్రానికి వచ్చిన ఏపూరు తండాకు చెందిన వాంకుడోతు బోడ్యా సొమ్మసిల్లి పడిపోయాడు. కొద్దిసేపటికి తేరుకున్నాడు.

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ సహకార సంఘానికి యూరియా లోడు వచ్చింది. కేవలం 277 బస్తాల యూరియా మాత్రమే రాగా రైతులు వందల సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారు జామున 4 గంటల నుంచే యూరియా కోసం రైతులు బారులు తీరారు. యూరియా ఎంతసేపటికీ ఇవ్వకపోవడంతో క్యూలో నిలబడలేక రైతులు చెప్పులను క్యూపద్ధతిలో పెట్టారు. కొంతమంది రైతులకు సహకార సంఘం అధికారులు టోకెన్లు ఇచ్చారు. సాయంత్రం 4 గంటల వరకు యూరియా ఇచ్చినా, సరిపడా లేకపోవడంతో 100మంది రైతులు నిరాశతో వెనుదిరిగారు.

అర్వపల్లి: అర్వపల్లి పీఏసీఎస్ కార్యాలయానికి 450యూరియా బస్తాలు రాగా పెద్దసంఖ్యలో రైతులు అక్కడికి చేరుకున్నారు. ఎస్‌ఐ సైదులు, తహసీల్దార్ శ్రీకాంత్, ఏవో గణేష్ ఆధ్వర్యంలో క్యూలైన్‌లో నిలబడి స్లిప్పులు ఉన్న రైతులకు యూరియా బస్తాలను అందజేశారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఉదయం ఆరుగంటల నుంచే రైతులు క్యూలైన్‌లో నిలబడ్డారు. చెప్పులు, ఆధార్‌కార్డులు, వరుసలో పెట్టి కూర్చున్నారు. ఎంతకూ టోకెన్లు ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన రైతులు నూతనకల్‌లోని సూర్యాపేట- దంతాలపల్లి రహదారిపై రాస్తారోకో చేశారు. కొద్దిసేపటి తర్వాత ఎస్‌ఐ రావుల నాగరాజు వచ్చి రైతులను సముదాయించి ఆందోళన విరమింపజేయించారు.

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాల్సిందే

● నిర్వాసితులకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలి

● ఆర్‌ఆర్‌ఆర్ నిర్వాసితుల ధర్నాలో విపక్ష నాయకులు

● మద్దతు తెలిసిన సీపీఐ, సీపీఎం, బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు



జాతీయరహదారిపై రైతుల ర్యాలీలో పాల్గొన్న నాయకులు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందే అని విపక్ష నాయకులు డిమాండ్ చేశారు. నిర్వాసితులకు భూమికి బదులు భూమి, ఇంటికి బదులు ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదా ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ ను ఓఆర్‌ఆర్‌కు 40 కిలోమీటర్ల దూరంలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం చౌటుప్పల్, వలిగొండ, సంస్థాన్ నారాయణపురం మండలాలకు చెందిన ఆర్‌ఆర్‌ఆర్ భూ నిర్వాసితులు ధర్నా చేశారు. రైతుల ఉద్యమానికి అన్ని పార్టీలు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ చౌటుప్పల్ ప్రాంతంలోని కొన్ని పరిశ్రమలకు అనుకూలంగా ఉండే విధంగా ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చారని అన్నారు. నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, అధికారం లేనప్పుడు మరోక విధంగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు, రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో పేదల భూములను ప్రభుత్వాలు లాక్కుంటున్నాయని ఆయన అన్నారు. భూములను కోల్పోతున్న రైతులకు ఎంత నష్ట పరిహారం చెల్లించిన కూడ తక్కువే అవుతుందని ఆయన అన్నారు. భూ నిర్వాసితులకు భూమికి భూమి, ఇళ్లకు ఇళ్లు, బహిరంగ మార్కెట్ విలువ ప్రకారంగా నష్టపరిహారాన్ని చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కొన్ని పరిశ్రమల కోసమే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్పిడి చేయించారని ఆయన ఆరోపించారు. ఆ ఇద్దరు నేతలు తలుచుకుంటే 5 రోజుల్లోనే అలైన్ మెంట్‌ను మార్చగలరని ఆయన అన్నారు. బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం అలైన్‌మెంట్‌ను బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టగా, దక్షిణ భాగాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని ఆయన అన్నారు. మార్కెట్ విలువకు మూడు రేట్లు అధికంగా నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో శేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బూరుగు కృష్ణా రెడ్డి, బీజేపీ, సీపీఐ, సీపీఎం, బీఆర్‌ఎస్ నాయకులు దూడల బిక్షం గౌడ్, ఆర్. శంకర్, దిండు భాస్కర్, బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, గిర్కటి నిరంజన్ గౌడ్, పల్లె శేఖర్ రెడ్డి ,పబ్బు వంశీ, వి. వెంకట్ రెడ్డి, దబ్బటి రామ్‌గౌడ్ పాల్గొన్నారు.

రాస్తారోకో యత్నం భగ్నం

చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారిపై రెండు, మూడు ప్రాంతాల్లో రాస్తారోకో చేసేందుకు నిర్వాసితులు చేసిన ప్రయత్నాలను పోలీసులు భగ్నం చేశారు. పోలీసులతో మహిళా రైతులు వాగ్వాదానికి దిగారు. ఆర్డీవో కార్యాలయంతో పాటు జాతీయ రహదారిపై పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించారు. ఏసీపీ పి.మధుసూధన్ రెడ్డి పర్యవేక్షణలో సీఐ మన్మథకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు రైతులను కట్టడి చేయడంతో పాటు వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

మతాలు, కులాల మధ్య బీజేపీ చిచ్చు

● టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

శాలిగౌరారం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ కులాలు, మతాల మధ్య పెట్టడమే తప్ప స్వాతంత్ర్య, సాయుధపోరాటంలో ఎటువంటి పాత్ర లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు వీ హనుమంతరావు సహకారంతో నిర్మించిన అమరవీరుల స్మారక పైలాన్‌ను శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి వందేళ్ల పైబడి చరిత్రతో పాటు పోరాట చరిత్ర ఉందన్నారు. 'ఆంధ్రజ్యోతి' పత్రికలో వచ్చిన కథనానికి వీహెచ్ చలించి అమరుల స్మారక స్థూపాన్ని నిర్మింపజేయడం అభినందనీయమన్నారు. తెలంగాణ సాయుధపోరాటంలో కాల్చి చంపబడిన విద్యార్థు పేర్లు, పోరాటం పాఠ్యాంశంలో చేర్చేందుకు సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. దేశంలో బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలనే దురుద్దేశ్యంతో సీబీఐ, ఈడీ, ఎలక్షన్ కమిషన్‌లను జేబు సంస్థలుగా చేసుకుంటుందన్నారు. బీజేపీ శ్రీరాముడి పేరుతో ఓట్లు అడగడం అవివేకమన్నారు.వల్లాలలో అమరులైన అమర కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు.

అమరుల కుటుంబాలకు ఇల్లు వచ్చేట్లు కృషి: వీహెచ్

వల్లాల గ్రామంలో 10మంది విద్యార్థులను రజాకార్లు చంపడం విచాకరమని, అమరుల కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు వచ్చేట్లు తనవంతుగా కృషి చేస్తానని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు వీ.హనుమంతరావు అన్నారు. అమరవీరుల స్థూపం నిర్మించడం తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో బీజేపీ పాత్ర శూన్యమన్నారు.

బలిదానంతో నవచైతన్యం : జానారెడ్డి

విద్యార్థుల బలిదానంతో పోరాటంలో నవచైతన్యం నింపిందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. అమరుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారిత్యాగం మరవలేనిదన్నారు. ఎమ్మెల్యే



వల్లాల గ్రామంలో స్థూపావిష్కరణ సభలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, వేదికపై మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, వీ హనుమంతరావు

అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడంలో ముందుండాలన్నారు.

కాంగ్రెస్‌తో రాష్ట్రం అభివృద్ధి : ఎంపీ చామల

స్వాతంత్ర్య, తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేసిందని, తెలంగాణను కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేసిందని ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. అదేవిధంగా సీపీఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అమరవీరుల కోసం ఒక స్మృతివనం ఏర్పాటు చేయాలని కోరారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, నేతి విద్యాసాగర్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ, తెలంగాణ ఇన్‌చార్జి విశ్వనాథన్, బీసీ నాయకులు చామల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నరిగే నర్సింహ, సింగిల్ విండో చైర్మన్ తాళ్లూరి మురళి, నాయకులు నూక కిరణ్‌కుమార్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు షేక్ ఇంతియాజ్‌అహ్మద్, భూపతి వెంకన్న, దండ అశోక్‌రెడ్డి, చింత ధనుంజయ, వడ్లకొండ పరమేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మాదగోని కవిత రామలింగయ్య, గోపినాథ్, అరుణ్‌కుమార్, నరేష్ పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వేములపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బొమ్మకల్ గ్రామశివారులోని పాలేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు నల్లగొండ జిల్లా వేములపల్లి ఎస్‌ఐ డీ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. డ్రైవర్లు బొమ్మకంటి గణేష్, బొమ్మకంటి శివ, దామెర్ల రాకేష్‌లపై కేసులను నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రాజీ మార్గమే రాజమార్గం

● నేడు జాతీయ మెగా లోక్ అదాలత్

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటక్రైం)

చాలామంది పట్టువిడుపులకు పోయి కేసులు రాజీ పడకుండా కోర్టుల చుట్టూ తిరుగుతుంటారు. సమాజంలో ప్రతీ ఒక్కరు రాజీ మార్గంలో పయనించాలని సూచిస్తున్నారు. కోర్టుల్లో కేసుల విషయంలో కూడా రాజీమార్గం అనుసరించాలని, అదే రాజమార్గమని న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం కోర్టుల్లో ఏర్పాటుచేసే లోక్ అదాలత్‌లలో కక్షిదారులు కేసులను పరిష్కరించుకుంటే బాగుంటుందని, ఇందుకోసం ఈ నెల 13న అన్ని ప్రధాన కోర్టుల్లో జాతీయ మెగాలోక్‌అదాలత్‌ను నిర్వహించబోతున్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసే కేసులకు సంబంధించిన వారికి అవగాహన కల్పిస్తున్నారు.

కక్షిదారులకు అవగాహన

సూర్యాపేట జిల్లా పరిధిలోని సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి కోర్టుల్లో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నారు. స్థానిక పోలీసులు కేసుల్లో ఉన్న కక్షిదారుల వివరాలను సేకరించి రాజీ కోసం వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఈమెగా లోక్ అదాలత్‌లో కనీసం సూర్యాపేట జిల్లాలో 10వేల కేసులు రాజీ అయ్యే అవకాశముందని భావిస్తున్నారు.


రాజీ అయ్యే కేసులు ఇలా..

లోక్ అదాలత్‌లో అన్ని రకాల కేసులు రాజీ పడే అవకాశం లేదు. కొన్ని సెక్షన్లకు సంబంధించిన కేసులు మాత్రమే రాజీ చేసుకునే అవకాశముంది. అదనపు కట్నం కోసం వేధించిన కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు గాయపడినవి మాత్రమే, పరువునష్టం, ఛీటింగ్, ఆస్తి తగాదాలకు చెందినవి, చెక్‌బౌన్స్ కేసులు, విడాకుల కేసులు, ఇన్సూరెన్స్‌కు సంబంధించిన, డ్రంకన్‌డ్రైవ్, పెట్టీ కేసులు రాజీ చేసుకునే వెసులుబాటు ఉంది.

లోక్ అదాలత్ ఉద్దేశం

క్షణికావేశంలో జరిగిన గొడవల కారణంగా ఒకరిపై మరొకరు పెట్టుకున్న కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేయడమే లోక్ అదాలత్ ఉద్దేశం. లోక్‌అదాలత్‌లను సంప్రదించినట్లయితే తక్కువ సమయంలో ఖర్చు లేకుండా ఇరువర్గాలకు సమ్మతమైన చట్టప్రకారం పటిష్ఠమైన న్యాయం పొందే అవకాశముంది. ఒకవేళ లోక్ అదాలత్‌లో రాజీ పడకపోతే కోర్టు సూచించిన ప్రకారం మళ్లీ కోర్టు తెలిపిన తేదీల్లో కోర్టుకు హాజరుకావాలి.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి



లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి.పంతాలు, పట్టింపులకు పోయి కోర్టుల చుట్టూ తిరగవద్దు. రాజీ పడగలిగే కేసుల్లో మాత్రమే లోక్ అదాలత్‌లో రాజీ పడే అవకాశముంది. కోర్టుల చుట్టూ తిరిగి సమయం, డబ్బు వృధా చేసుకోవద్దు. రాజీ మార్గమే రాజమార్గం. కేసులు ఇరువర్గాలు రాజీ పడడం వలన స్నేహం ఏర్పడుతుంది. దీంతో ప్రశాంతంగా జీవించవచ్చు.

-కొత్తపల్లి నర్సింహ, ఎస్పీ సూర్యాపేట జిల్లా

ఫర్టిలైజర్స్ దుకాణంలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్స్ దుకాణానికి కేటాయించిన యూరియా కోటాను విక్రయించడంలో జరుగుతున్న జాప్యంపై పలువురు నుంచి ఫిర్యాదులు అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం జరిగింది. టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐలు మహేందర్, శివ, ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్‌తో కలసి తనిఖీలు చేపట్టారు. పాత వ్యవసాయమార్కెట్ యార్డు రోడ్డులోని రైతుమిత్ర ఫెర్టిలైజర్స్ దుకాణానికి 20మెట్రిక్ టన్నుల యూరియాను అధికారులు కేటాయించారు. అయితే దుకాణంలో దిగుమతైన యూరియాను విక్రయించడంలో డీలర్ నిర్లక్ష్యం ప్రదర్శించడంతో డయల్-100కు ఫోన్‌చేసి రైతులు ఫిర్యాదుచేశారు. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దుకాణంలో తనిఖీలు చేపట్టి స్టాక్, సేల్ రికార్డులను పరిశీలించారు. 20 మెట్రిక్ టన్నుల(400బస్తాలు) యూరియా కోటాను విక్రయించకుండా గోదాంలోనే నిల్వ చేయడంపై అనుమానం వ్యక్తం చేశారు. గోదాం తాళాలు స్వాధీనం చేసుకుని డీలర్ అశోక్‌రెడ్డిని ప్రశ్నించారు. సర్వర్ బిజీ కారణంగా ఈ-పాస్ మిషన్ ఐడీ అప్రువల్ ఆలస్యం కావడంతో శుక్రవారం మధ్యాహ్నం వరకు యూరియా విక్రయాల్లో జాప్యం జరిగిందని డీలర్ అధికారులకు వివరించారు. దీనిపై మరింత లోతుగా విచారించేందుకు డీలర్‌ను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఇందిరమ్మ బిల్లు రాలేదని ఇటుకతో తలపై కొట్టుకుని..

మోటకొండూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత డబ్బులు రావని అధికారులు తెలుపడంతో ఓ లబ్ధిదారురాలి భర్త ఇటుకతో తలపై కొట్టుకోవడంతో గాయమైంది. యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన పీట్ల సుశీల, రాజుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేసింది. మొదటి విడతగా సుశీల ఖాతాలో రూ.లక్ష జమకాగా అప్పుచేసి స్లాబ్ వరకు నిర్మించాడు. శుక్రవారం హౌసింగ్ ఏఈ రవిచంద్ర గ్రామానికి చెందిన వేరే లబ్ధిదారుడి ఫొటో తీస్తుండగా అక్కడకు వచ్చిన సుశీల భర్త రాజు ఏఈతో రెండో విడత డబ్బులు రావడం లేదని గొడవకు దిగాడు. అనంతరం అసహనంతో పక్కనే ఉన్న ఇటుకతో తలపై కొట్టుకుని అక్కడి నుంచి వెళ్లి పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపాడు. ఎస్‌ఐ అశోక్ ఘటన స్థలానికి చేరుకుని ఏఈని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో ఇందిరను వివరణ కోరాగా వాహనం, ఆస్తి లేవని తెలపడంతో మొదటి విడత డబ్బులు వచ్చాయన్నారు. రెండో విడత డబ్బులు రావాల్సి ఉండగా రాజుపై 2018లో టిప్పరు వాహనం ఉందని తేలడంతో డబ్బులు జమకావడం లేదన్నారు. విషయం తెలిసిన వెంటనే ఇంటి నిర్మాణం నిలిపివేయాలని సూచించామన్నారు. హౌసింగ్ ఏఈ రవిచంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు.

స్పోర్ట్స్

నల్లగొండ ● శనివారం 13 సెప్టెంబరు 2025



తొలిరోజు మనదే

● సింగిల్స్‌లో దక్షిణేశ్వర్, సుమిత్ గెలుపు

● భారత్ 2-0 ● స్విట్జర్లాండ్‌తో డేవిస్ కప్

బీల్ (స్విట్జర్లాండ్): డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో భాగంగా ఆతిథ్య స్విట్జర్లాండ్‌తో పోరులో తొలిరోజు భారత్‌దే పైచేయి అయింది. శుక్రవారం జరిగిన సింగిల్స్, రివర్స్ సింగిల్స్ మ్యాచుల్లో భారత ఆటగాళ్లు గెలవడంతో 2-0 ఆధిక్యం లభించింది. అయితే, ప్రధానంగా తొలిసారి డేవిస్ కప్ ఆడుతున్న తమిళనాడుకు చెందిన దక్షిణేశ్వర్ సురేష్ తనకంటే మెరుగైన ర్యాంకరైన ప్రత్యర్థిని ఓడించడం మొదటిరోజు ఆటలో విశేషం. తొలి సింగిల్స్‌లో 626వ ర్యాంకర్ దక్షిణేశ్వర్ 7-6 (5), 6-3తో 155వ ర్యాంకరైన జెరోమ్ కిమ్‌ను చిత్తు చేసి సంచలనం సృష్టించాడు. అనంతరం జరిగిన రివర్స్ సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన సుమిత్ నగల్ 6-3, 7-6(4)తో మార్క్ అండ్రియా హస్లెర్‌పై గెలిచి భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. ఇక, శనివారం జరిగే డబుల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ/బొల్లిపల్లి రిత్విక్ చౌదరి జోడీ బరిలోకి దిగనుంది.

స్టార్లతో కళకళ

నేటినుంచి వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్

భారత్ ఆశలన్నీ నీరజ్‌పైనే



స్టార్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం

టోక్యో: ఒలింపిక్స్ తర్వాత అథ్లెటిక్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది ప్రపంచ చాంపియన్‌షిప్స్. విశ్వవ్యాప్త ప్రఖ్యాత అథ్లెట్ల సత్తాకు పరీక్షగా నిలిచే ఈ చాంపియన్‌షిప్స్ శనివారం టోక్యోలో ప్రారంభం కానున్నాయి. ఈనెల 21 వరకు జరిగే పోటీలలో 200 జట్ల నుంచి 2000 మంది అథ్లెట్లు తలపడుతున్నారు. 49 విభాగాలలో మొత్తం 147 పతకాలకోసం హోరాహోరీ పోరు జరగనుంది. షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్, షకారీ రిచర్డ్‌సన్, నోవా లైల్స్, కిషానే థాంప్సన్, సిడ్నీ మెక్‌లాలిన్, అర్మాండ్ డుప్లాంటిస్, నీరజ్ చోప్రా వంటి మేటి అథ్లెట్లు ఫ్యాన్స్‌ను అలరించనున్నారు.

నేటి భారత షెడ్యూల్
ఉ. 4 గం.: పురుషుల 35 కి.మీ. రేస్ వాక్-రాంబాబు, సందీప్; మహిళల 35 కి.మీ. రేస్‌వాక్-ప్రియాంక గోస్వామి
సా. 4.30: మహిళల 1500 మీ. హీట్-పూజ

షెల్లీ ఘనంగా ముగిస్తుందా..?

ఈసారి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో జమైకా స్ప్రింట్ దిగ్గజం, మహిళల 100 మీ. స్ప్రింట్ రారాణి షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్‌పై అందరి దృష్టి నిలిచింది. 38 ఏళ్ల స్టార్ ఈ పోటీల తర్వాత ట్రాక్ నుంచి రిటైర్ కానుంది. మూడు ఒలింపిక్, 10 ప్రపంచ చాంపియన్‌షిప్స్ స్వర్ణ పతకాల విజేత షెల్లీ టైటిల్‌తో ఘనమైన వీడ్కోలు తీసుకోవాలని భావిస్తోంది. అలాగే మహిళల 100, 200 మీ.లలో అమెరికన్ క్వీన్ షకారీ రిచర్డ్‌సన్ ప్రధాన ఆకర్షణ కానుంది. గత వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో నెగ్గిన 100 మీ. టైటిల్‌ను నిలబెట్టుకోవాలని రిచర్డ్‌సన్ పట్టుదలగా ఉంది. గాయాలతో సతమతమవుతున్న పురుషుల 100.మీ., 200 మీ.ల డిఫెండింగ్ చాంపియన్ నోవా లైల్స్ (అమెరికా) టైటిళ్లు నిలబెట్టుకుంటాడేమో చూడాలి. సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న జమైకా స్ప్రింటర్ కిషానే థామ్సన్..నోవాకు గట్టి పోటీ ఇవ్వనున్నాడు. బరిలో దిగిన ప్రతి టోర్నీలో రికార్డులు నమోదు చేస్తున్న పురుషుల పోల్‌వాల్ట్ మొనగాడు అర్మాండ్ డుప్లాంటిస్ టోక్యోలో నెలకొల్పే రికార్డుపై ఉత్కంఠ ఏర్పడింది. ఇంకా భారత స్టార్ నీరజ్ చోప్రా, మహిళల 400 మీ. హర్డిల్స్‌లో ప్రపంచ రికార్డు గ్రహీత సిడ్నీ మెక్‌లాలిన్ (అమెరికా), మహిళల 1500, 5వేల మీ.లలో కిప్‌యేగాన్ (కెన్యా) మెరుపులు చూసి తీరాల్సిందే.



టైటిల్‌పై నీరజ్ గురి

భారత్ ఆశలన్నీ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాపైనే నిలిచాయి. 2023 బుడాపెస్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో జావెలిన్ పసిడి పతకంతో చరిత్ర సృష్టించిన నీరజ్.. ఆ టైటిల్‌ను నిలబెట్టుకోడమే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నాడు. అయితే పాకిస్థాన్‌కు చెందిన ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్, చెక్ త్రోయర్ జాకబ్ వాల్డేచ్‌ల నుంచి నీరజ్‌కు తీవ్రమైన పోటీ ఎదురుకానుంది. ఇక..మొత్తం 19 మంది అథ్లెట్ల భారత బృందం టోక్యోలో తలపడుతోంది. కానీ పతక ఆశలు మాత్రం నీరజ్‌పైనే నిలిచాయి. ఈనెల 17న జావెలిన్ ఈవెంట్ మొదలు కానుంది. భారత్ నుంచి అన్నూరాణి (మహిళల జావెలిన్), పారుల్ చౌదరి (3000మీ స్టీపుల్ చేజ్), మురళీ శ్రీశంకర్ (లాంగ్ జంప్), గుల్వీర్ సింగ్ (5000మీ.), ప్రవీణ్ చిత్రవేల్ (ట్రిపుల్ జంప్) కూడా బరిలో ఉన్నారు.

ఫైనల్‌కు జైస్మిన్



సెమీస్‌లో మీనాక్షి ● ప్రపంచ బాక్సింగ్

లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్ జైస్మిన్ లంబోరియా ఫైనల్ చేరింది. మహిళల 57 కిలోల విభాగం సెమీస్‌లో జైస్మిన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా (వెనెజులా)ను చిత్తుచేసి కనీసం రజతం ఖాయం చేసుకుంది. మరో అమ్మాయి మీనాక్షి హుడా సెమీస్ చేరడంతో భారత్ ఖాతాలో మరో పతకం ఖరారైంది. 48 కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో మీనాక్షి 5-0తో అలైస్ పుంప్రే (ఇంగ్లండ్)ను ఓడించింది. ఇక..పురుషుల విభాగంలో భారత్ పోరు ముగిసింది. బరిలో మిగిలిన జాదుమని సింగ్ 50 కిలోల కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో సాంఝర్ (కజకిస్థాన్) చేతిలో 0-4తో పరాజయం పాలయ్యాడు.

పాక్ శుభారంభం

ఒమన్‌పై ఘనవిజయం

ఆసియా కప్‌లో నేడు
బంగ్లాదేశ్ x శ్రీలంక
రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



దుబాయ్: భారత్‌తో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ జట్టు కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. ఆసియా కప్‌లో భాగంగా శుక్రవారం గ్రూప్ 'ఎ'లో ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 93 పరుగుల తేడాతో నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మహ్మద్ హారీస్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 66) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఆరంభంలో తడబడినా.. చివరకు 20 ఓవర్లలో 7 వికెట్లకు 160 పరుగులు సాధించింది. ఓపెనర్ సహిబ్జాద ఫర్హాన్ (29), ఫఖర్ జమాన్ (23 నాటౌట్), మహ్మద్ నవాజ్ (19) ఫర్వాలేదనిపించారు. పేసర్ షా ఫైజల్, స్పిన్నర్ ఆమిర్ కలీమ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పాక్ బౌలర్ల ధాటికి ఒమన్ బ్యాటర్లు తేలిపోయారు. దీంతో ఆ జట్టు 16.4 ఓవర్లలో 67 పరుగులే చేసి చిత్తుగా ఓడింది. 10 పరుగుల వ్యవధిలోనే ఏడు వికెట్లు కోల్పోవడం గమనార్హం. హమ్మద్ మీర్జా (27) ఒక్కడే కాస్త పోరాడాడు. స్పిన్నర్లు సుఫియాన్, సయీమ్ అయూబ్‌లతో పాటు పేసర్ ఫహీమ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 160/7 (మహ్మద్ హారీస్ 66, ఫర్హాన్ 29, ఫఖర్ 23; కలీమ్ 3/31, ఫైజల్ 3/34).

ఒమన్: 16.4 ఓవర్లలో 67 ఆలౌట్. (హమ్మద్ 27; ఫహీమ్ 2/6, సుఫియాన్ 2/7, సయీమ్ అయూబ్ 2/8).

సెమీస్‌లో సాత్విక్ జోడీ

● లక్ష్యసేన్ కూడా..

● హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: భారత షట్లర్లు లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్/ చిరాగ్ షెట్టి హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నారు. సింగిల్స్‌లో లక్ష్యసేన్, డబుల్స్‌లో సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో ప్రవేశించారు. ఇద్దరు భారత ఆటగాళ్ల మధ్య జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో లక్ష్య 21-16, 17-21, 21-13తో ఆయుష్ షెట్టిపై గెలుపొందాడు. గత మ్యాచ్‌లో 2024 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ కొడాయి నరౌకాకి షాకిచ్చి సంచలనం సృష్టించిన ఆయుష్.. లక్ష్యతో పోరులో మాత్రం తడబడ్డాడు. అయితే ఓడినా.. ఆయుష్ గెలుపు కోసం చివరిదాకా పోరాడిన తీరు ఆకట్టుకుంది. గంటా ఆరు నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలి గేమ్ ఓడినా, రెండో గేమ్‌లో లక్ష్యపై పైచేయి సాధించి మ్యాచ్ గెలిచేలా కనిపించాడు. కానీ, నిర్ణాయక మూడో గేమ్ ఆఖర్లో పలుమార్లు ఔట్ షాట్‌లు కొట్టి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ఫైనల్ బెర్త్ కోసం తైవాన్ షట్లర్, మూడో సీడ్ చో తిన్ చెన్‌తో లక్ష్య అమీతుమీ తేల్చుకోనున్నాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో 8వ సీడ్ సాత్విక్/చిరాగ్ జంట 21-14, 20-22, 21-16తో మలేసియా జోడీ ఆరిఫ్ జునైది/రాయ్ కింగ్ యాప్‌ను ఓడించింది. ఇటీవలే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తా చాటిన సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో తైవాన్ జోడీ చెన్ చెంగ్ కాన్/లిన్ బింగ్ వీతో తలపడనుంది.

గాథ పోరు ముగిసె..

● నెంబర్‌వన్ చేతిలో ఓటమి

● ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్‌కు ఈసారీ నిరాశ తప్పలేదు. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ప్రీక్వార్టర్స్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన 15 ఏళ్ల గాథ ఖడాకే పోరాటం ముగిసింది. ప్రపంచ నెంబర్‌వన్, పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాల విజేత లిమ్ షియోన్ (కొరియా)తో జరిగిన పోరులో గాథ 0-6తో ఓటమిపాలైంది. ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్ చివరిసారిగా 2019లో పురుషుల జట్టు రజతం నెగ్గింది. కాగా, ఈసారి టోర్నీలో కాంపౌండ్ ఈవెంట్‌లో పురుషుల జట్టు స్వర్ణం, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ/రిషభ్ జోడీ రజతం నెగ్గిన సంగతి తెలిసిందే.

యష్, రజత్ శతకాలు

● సెంట్రల్ జోన్ 384/5 ● 'సౌత్'తో దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ రెండో రోజే పట్టు బిగించింది. యష్ రాథోడ్ (137 బ్యాటింగ్), కెప్టెన్ రజత్ పటీదార్ (101) శతకాల సహాయంతో.. శుక్రవారం ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 384/5 స్కోరు సాధించింది. ప్రస్తుతం జట్టు 235 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది. ఓపెనర్ మలేవార్ (53) హాఫ్ సెంచరీ చేయగా, క్రీజులో యష్‌తో పాటు సారాంశ్ (47 బ్యాటింగ్) ఉన్నాడు. లెఫ్టామ్ పేసర్ గుర్జప్‌నీత్‌కు మూడు వికెట్లు దక్కాయి. సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకు కుప్పకూలిన విషయం తెలిసిందే.

బెంగళూరు హ్యాట్రిక్

జైపూర్: ప్రొ. కబడ్డీ లీగ్‌లో బెంగళూరు బుల్స్ జోరు ప్రదర్శిస్తూ వరుసగా మూడో విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 28-23తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. దీపక్ శంకర్ మరో 'హై ఫైవ్'తో అదరగొట్టగా, రైడర్ అలీరెజా 8 పాయింట్లతో సత్తా చాటాడు. జైపూర్‌లో నితిన్ కుమార్ (8) ఒక్కడే రాణించాడు. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 46-36తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.

ఇక దయచేయండి!



విరుష్కతో కివీస్ హోటల్ సిబ్బంది

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ, అనుష్క జోడీని వెళ్లిపోవాలని న్యూజిలాండ్‌లోని ఓ హోటల్ సిబ్బంది కోరిన ఉదంతాన్ని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. గతంలో భారత పురుషులు, మహిళల జట్లు ఒకే సమయంలో కివీస్‌లో పర్యటించాయి. ఇరు జట్లూ ఒకే హోటల్‌లో బస చేశాయి. ఈక్రమంలో బ్యాటింగ్‌కు సంబంధించి సలహాలు ఇవ్వాలని స్మృతి మంధాన, జెమీమా..విరాట్‌ను కోరారు. దాంతో అదే హోటల్‌లోని కేఫ్‌కు రావాలని విరాట్ వారికి సూచించాడు. అప్పటికే కోహ్లీ, అనుష్క జోడీ అక్కడ ఉంది. దాదాపు నాలుగు గంటలపాటు విరాట్, మంధాన, జెమీమాతోపాటు అనుష్క మాట్లాడుకున్నారట. తొలి అరగంట క్రికెట్ విషయాలపై చర్చించగా.. ఆపై సాధారణ జీవితానికి సంబంధించిన మాటల్లోకి జారుకున్నట్టు జెమీమా వెల్లడించింది. అప్పటికే రాత్రి 11.30 కావడంతో కేఫ్ సిబ్బంది వచ్చి విరాట్, అనుష్కను అక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించినట్టు రోడ్రిగ్స్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది.

ఐపీఓ మార్కెట్లో సంస్కరణలు

● కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌పై కంపెనీలకు ఊరట

● 10 ఏళ్ల వరకు గడువు పెంపు

● సెబీ చైర్మన్ పాండే



ముంబై : దేశ క్యాపిటల్ మార్కెట్లో మరిన్ని సంస్కరణలకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శ్రీకారం చుట్టింది. శుక్రవారం చైర్మన్ తుహిన్ కాంత పాండే అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో సెబీ దీనికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పెద్దమొత్తంలో మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలకు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల జారీలో మరింత వెసులుబాటు కల్పించాలని సెబీ నిర్ణయించింది. రూ.50,000 కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలు తమ ఈక్విటీలో 25 శాతం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) కలిగి ఉండాలన్న గడువును ప్రస్తుత మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పొడిగించారు. కంపెనీలు ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ముందు కనీసం 8 శాతం ఈక్విటీ షేర్లను జారీ చేసి, ఆ తర్వాత మిగతా 17 శాతం ఈక్విటీ షేర్లను దశలవారీగా ఐపీఓల ద్వారా విక్రయించేందుకు అనుమతిస్తారు. రూ.లక్ష కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు ఐదేళ్లలో జారీ చేయాల్సిన ఎంపీఎస్ ఈక్విటీ షేర్ల పరిమితినీ సెబీ సవరించింది. ప్రస్తుతం ఈ కంపెనీలు ఇందుకోసం ముందుగా 5 శాతం ఈక్విటీని ఎంపీఎస్‌గా జారీ చేయాలి. దీన్ని 2.75 శాతానికి కుదించాలని సెబీ నిర్ణయించింది. ఇక రూ.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు 25 శాతం ఎంపీఎస్‌కి చేరాల్సిన గడువునీ ప్రస్తుత ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. ఇందుకోసం ఈ కంపెనీలు ముందు తమ ఈక్విటీలో 2.5 శాతం షేర్లను ఐపీఓ ద్వారా జారీ చేస్తే సరిపోతుంది.

మిగతా 22.5 శాతం ఈక్విటీ షేర్లను మార్కెట్ పరిస్థితులను బట్టి పదేళ్లలో జారీ చేస్తే సరిపోతుంది.

పెద్ద కంపెనీలకు ఊరట: సెబీ తాజా నిర్ణయం త్వరలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే రిలయన్స్ జియో, ఎన్ఎస్ఈలకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగా ఒకేసారి పెద్ద మొత్తంలో ఐపీఓలు జారీ చేస్తే.. ఆ ఇష్యూలను భరించే శక్తి మార్కెట్‌కు లేకపోవడంతో పాటు సెకండరీ మార్కెట్ కూడా తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. నిర్ణీత గడువులోనే దశల వారీగా ఈ వాటా విక్రయించేందుకు అనుమతించాలని కంపెనీలు ఎప్పటి నుంచో కోరుతున్నాయి. సెబీ ఎట్టకేలకు శుక్రవారం దీనికి ఆమోదం తెలిపింది.

రిటైల్ మదుపరులకు ఊరట: ప్రస్తుతం రూ.5,000 కోట్లకు మించిన ఐపీఓ ఇష్యూల్లో రూ.2 లక్షల లోపు పెట్టుబడితో దరఖాస్తు చేసే రిటైల్ మదుపరులకు 35 శాతం షేర్లు కేటాయిస్తున్నారు. దీన్ని 25 శాతానికి కుదించాలని సంస్థాగత మదుపరుల నుంచి ఒత్తిడి వచ్చింది. అయినా ఈ వాటాను యథాతథంగా 35 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించినట్టు సెబీ చైర్మన్ పాండే చెప్పారు. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ)కు కేటాయించే 50 శాతం వాటానూ అలాగే కొనసాగించాలని సెబీ నిర్ణయించింది.

ఎఫ్‌పీఐల పెట్టుబడులకు సింగిల్ విండో: భారత స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీని ద్వారా తక్కువ రిస్క్ కలిగిన ఎఫ్‌పీఐల పెట్టుబడులను ఆకర్షించవచ్చని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సింగిల్ విండో ఆటోమేటిక్ అండ్ జనరలైజ్డ్ యాక్సెస్ ఫర్ ట్రస్టెడ్ ఫారిన్ ఇన్వెస్టర్స్ (స్వాగత్-ఎఫ్ఐ) పేరుతో కొత్త ముసాయిదాను రూపొందించింది. కాగా దేశంలో ప్రతి నెలా 100 ఎఫ్‌పీఐలు నమోదవుతూ వస్తున్నాయని సెబీ తెలిపింది. ఏడాది క్రితం 10,500 ఎఫ్‌పీఐలు నమోదై ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 12,000 దాటిందని పేర్కొంది.

ఇతర ప్రధాన నిర్ణయాలు

- రూ.250 కోట్లకు మించిన ఐపీఓల్లో యాంకర్ ఇన్వెస్టర్ల వాటా 10% నుంచి 15 శాతానికి పెంపు
- రూ.250 కోట్ల కంటే తక్కువ ఉండే ఐపీఓల్లో మదుపు చేసే యాంకర్ ఇన్వెస్టర్ల సంఖ్య 5 నుంచి 15 మధ్య ఉండాలి
- నియమిత మదుపరులకు సేవలు అందించే ఏఐఎఫ్‌లకు ఊరట
- రీట్స్, ఇన్విట్స్.. ఈక్విటీ పెట్టుబడులుగా వర్గీకరణ
- ప్రతి స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల నియామకం

● ఐటీసీ ఆశీర్వాద్ మసాలా..నేచురల్ స్టార్ నానితో 'దమ్ము మీదే.. స్టార్ మీరే' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆంధ్ర, తెలంగాణ వాసుల అభిరుచులకు అనుగుణంగా దమ్దార్ ఫుడ్, సినిమా పేరుతో ఈ క్యాంపెయిన్‌ను మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించింది. ఇందులో భాగంగా వంటల పోటీలో గెలిచిన మహిళలతో నాని సినిమా థియేటర్ ప్రకటనలో కనిపించనున్నారు.

● హెల్త్‌కేర్ టెక్నాలజీ సంస్థ ఫుజిఫిల్మ్ ఇండియా.. నిజామాబాద్‌లో తన అడ్వాన్స్‌డ్ ఏఎంయుఎల్ఈటీ ఇన్నోవాలిటీ ఫుల్ ఫీల్డ్ డిజిటల్ మమ్మోగ్రఫీ (ఎఫ్ఎఫ్‌డీఎం) సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. విశ్వమ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లో ఈ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. బ్రెస్ట్ క్యాన్సర్ డయాగ్నోసిస్‌లో ఈ మమ్మోగ్రఫీ కీలకంగా ఉండనుంది.

● టాటా ఈవీ.. మార్కెట్లోకి సరికొత్త నెక్సాన్ ఈవీ విడుదల చేసింది. ఏడీఏఎస్ సేఫ్టీ టెక్‌తో దీన్ని తీసుకువచ్చింది. దీంతో పాటు కొన్ని కొత్త ఫీచర్లను పొందుపరిచింది. ఎంపవర్డ్ ప్లస్ ఏ45, ఏ45 డార్క్, ఏ 45 రెడ్ డార్క్ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ నెక్సాన్ ఈవీ ధరలు వరుసగా రూ.17.29 లక్షలు, రూ.17.49 లక్షలు, రూ.17.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి.

హైదరాబాద్ మార్కెట్లోకి విన్‌ఫాస్ట్

వీఎఫ్6, వీఎఫ్7 ఎలక్ట్రిక్ కార్లు విడుదల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వియత్నాం కేంద్రంగా ఉన్న విన్‌గ్రూప్ జేఎస్‌సీ ఎలక్ట్రిక్ వాహన సంస్థ విన్‌ఫాస్ట్ ఇండియా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించింది. శుక్రవారం నాడిక్కడ కంపెనీ డిప్యూటీ సీఈఓ అరుణోదయ్ దాస్.. గచ్చిబౌలి, బేగంపేటల్లో నానేష్ ఆటోమోటివ్స్ ఏర్పాటు చేసిన షోరూమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్లోకి విన్‌ఫాస్ట్ ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లు వీఎఫ్6, వీఎఫ్7 విడుదల చేశారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 10 ఏళ్ల బ్యాటరీ వారంటీతో ఈ కార్లను తీసుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. కాగా, వీఎఫ్6 ప్రారంభ ధర రూ.16.49 లక్షలు, వీఎఫ్7 ప్రారంభ ధర రూ.20.89 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించినట్లు దాస్ తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా 27కి పైగా నగరాల్లో 35 డీలర్‌షిప్స్, 26 వర్క్‌షాప్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ మార్కెట్లో ఇప్పటికే 150కి పైగా కార్లకు బుకింగ్స్ వచ్చాయని, ఈ నెల 22 నుంచి వీటి డెలివరీలను ప్రారంభించనున్నట్లు నానేష్ ఆటో డైరెక్టర్ అక్షయ్ జైన్ తెలిపారు.

బిజినెస్

అపోలో హాస్పిటల్స్ చేతికి అపోలో హెల్త్

● ఐఎఫ్‌సీ నుంచి 31 శాతం వాటా కొనుగోలు

● డీల్ విలువ రూ.1,254 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) పూర్తి స్థాయిలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) అనుబంధ సంస్థ కానుంది. ఇందుకోసం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) చేతిలో ఉన్న 31 శాతం వాటాను ఏహెచ్ఈఎల్ రూ.1,254.07 కోట్లకు కొనుగోలు చేయనుంది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఏహెచ్ఈఎల్ డైరెక్టర్ల బోర్డు ఈ షేర్ల కొనుగోలు ఒప్పందానికి ఆమోదం తెలిపింది. దీంతో ఏహెచ్ఎల్ఎల్ ఈక్విటీలో ఏహెచ్ఈఎల్ వాటా 99.42 శాతానికి చేరుతుంది. మిగతా 0.58 శాతం షేర్లు ఈ-సాప్స్ కింద ఉద్యోగుల వద్ద ఉంటాయి. ఏహెచ్ఎల్ఎల్ కార్యకాపాలపై పూర్తి నియంత్రణ, యాజమాన్యం కోసం ఐఎఫ్‌సీ నుంచి ఈ వాటాలను కొనుగోలు చేస్తున్నట్టు ఏహెచ్ఈఎల్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. దీనివల్ల ఏహెచ్ఎల్ఎల్ నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడడంతో పాటు, ఆ సంస్థ వ్యాధి నిర్ధారణ సేవలను ఏహెచ్ఈఎల్‌తో పూర్తి స్థాయిలో అనుసంధానించేందుకు వీలవుతుందని పేర్కొంది. ఈ చర్య అపోలో గ్రూప్ సమగ్ర ఆరోగ్య సేవలకు మరింత విలువ జోడిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ సునీతా రెడ్డి తెలిపారు. ఏహెచ్ఎల్ఎల్‌పై పూర్తి పట్టు ద్వారా ఆ కంపెనీకి చెందిన ప్రాథమిక ఆరోగ్య, వ్యాధి నిర్ధారణ సేవలు, మహిళల ఆరోగ్యం, డెంటల్, డయాలసిస్, అంబులెన్స్ సేవలను మరింత ముందుకు తీసుకు వెళతామని ఏహెచ్ఈఎల్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు.

గురుగ్రామ్‌లో క్యాన్సర్ కేర్ సెంటర్: గురుగ్రామ్‌లో రూ.573 కోట్ల పెట్టుబడితో అదనంగా సమగ్ర క్యాన్సర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకూ ఏహెచ్ఈఎల్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ కేంద్రం ద్వారా ఏటా అదనంగా 350 రోగులకు వైద్య సేవలు అందించవచ్చు. 2029 మార్చి నాటికి ఈ కేంద్రం ఏర్పాటు పూర్తవుతుంది.

మళ్లీ ధరలు సుర్..

ఆగస్టు ద్రవ్యోల్బణం 2.07%

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం మరోసారి ఊర్ధ్వముఖ చలనం ప్రారంభించింది. కూరగాయలు, మాంసం, చేపలు, గుడ్ల ధరలు పెరగడంతో ఆగస్టు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.07 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం జూలైలో 1.61%, గత ఏడాది ఆగస్టులో (-) 0.69% ఉంది. 9 నెలల పాటు వరుసగా తగ్గుతూ వచ్చిన వినియోగదారుల ధరల సూచీ ఆగస్టులో తొలిసారి ఎగువకు కదిలింది. అయితే ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధి 4% (2 శాతం ఎగువకు లేదా దిగువకు సద్దుబాటుతో)లోపే ఉంది. ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 1.18% నుంచి 1.69 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 2.1% నుంచి 2.47 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే కేరళలో గరిష్ఠంగా9.04% ఉండగా అసోమ్‌లో కనిష్ఠంగా -0.66% ఉంది. ఆహార, ఇంధన విభాగాలు మినహా ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణం 4.3 శాతంగా ఉంది.

మార్కెట్లలో కొనసాగిన ర్యాలీ

ఇటు ఈక్విటీలు, అటు బులియన్ పరుగులు

ముంబై: అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న ఆశలతో పాటు ఇన్ఫోసిస్ ప్రకటించిన భారీ బైబ్యాక్ ఉత్తేజంతో శుక్రవారం కూడా ఈక్విటీ మార్కెట్లో ర్యాలీ కొనసాగింది. వరుసగా సెన్సెక్స్ ఐదో రోజు, నిఫ్టీ ఎనిమిదో రోజు లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 444.12 పాయింట్లు లాభంతో 81,992.85 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరికి 355.97 పాయింట్ల లాభంతో 81,904.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 108.50 పాయింట్ల లాభంతో 25,114 వద్ద ముగిసింది. వారం మొత్తంలో సెన్సెక్స్ 1193.94 పాయింట్లు, నిఫ్టీ 373 పాయింట్లు లాభపడ్డాయి. వరుసగా 8 సెషన్లలో నిఫ్టీ 534 పాయింట్లు లాభపడింది.

బంగారం, వెండి భగభగ

బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరల ర్యాలీ కూడా అప్రతిహతంగా కొనసాగుతోంది. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.700 పెరిగి మరో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,13,800 వద్ద ముగిసింది. 99.5% స్వచ్ఛత గల బంగారం ధర సైతం రూ.700 పెరిగి రూ.1,13,300 వద్ద స్థిరపడింది. రెండు రోజుల నష్టాలకు తెర దించిన వెండి ధర బలమైన పునరుజ్జీవం సాధించింది. కిలో వెండి రూ.4,000 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,32,000 వద్ద స్థిరపడింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	132
కరీంనగర్	121	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	118
కర్నూలు	121	నెల్లూరు	123
విశాఖపట్నం	144	అనంతపురం	123
గోదావరి	140		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,280 ▲	1,02,000 ▲	1,41,000 ▲
విజయవాడ	1,13,150 ▲	1,07,000 ▲	1,31,800 ▲
విశాఖపట్నం	1,13,040 ▲	1,00,540 ▼	1,42,000 ▲
రాజమండ్రి	1,11,270 ▲	1,02,000 ▲	1,28,300 ▲
ప్రొద్దుటూరు	1,13,200 ▼	1,04,140 ▼	1,31,600 ▲
ముంబై	1,09,707 ▲	1,00,492 ▲	1,28,008 ▲

జీడీసీలో 15, 16తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

రామన్నపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల(జీడీసీలో ఈనెల 15, 16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రహత్ ఖానం తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణత కలిగి డిగ్రీలో ప్రవేశం పొందని వారికి చివరి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మూడో తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు స్టడీ సర్టిఫికెట్లు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫోటో వెంట తీసుకుని రావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల పరిశీలన

గుండాల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ హరికృష్ణను ఆదేశించారు. రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. వర్షాల కారణంగా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ హరికృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వర్షంతో ఆలేరు అతలాకుతలం



వరద నీటి నుంచి మహిళను తీసుకువస్తున్న 'విపత్తు' సిబ్బంది

(3వ పేజీ తరువాయి)

గ్రామాల నడుమ ఉన్న లోలెవల్ బ్రిడ్జి పైనుంచి అధికారులు రాకపోకలను నిలిపి వేశారు. ప్రొద్దటూరు-వర్కట్‌పల్లి గ్రామాల నడుమ రాకపోకలను కూడా నిలిపివేశారు. వర్షాలతో చిట్యాల-భువనగిరి ప్రధాన రహదారిపై అక్కంపల్లి, వలిగొండ వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి.

ఉధృతంగా ప్రవహిస్తున్న బిక్కేరు వాగు

(ఆంధ్రజ్యోతి, మోత్కూరు, గుండాల, భూదాన్‌పోచంపల్లి): మోత్కూరు మండలంలో గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వారం, పది రోజులుగా ఎండలు తీవ్రంగా ఉండటంతో పత్తి, కంది చేలు వాడుపట్టాయి. ఈ తరుణంలో గురువారం కురిసిన వర్షం మెట్ట పంటలకు తిరిగి జీవం పోసినట్టయింది. తెగుళ్లు కూడా తగ్గే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. మోత్కూరు పైభాగాన ఉన్న ఆలేరు, మోటకొండూరు, ఆత్మకూరు, గుండాల మండలాల్లో వర్షం ఎక్కువగా ఉండటంతో బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అనంతారం-కిశన్‌గూడ గ్రామాల మధ్య బ్రిడ్జి పైనుంచి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. తహసీల్దార్ హరికృష్ణ వాగును పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ, పోలీసు సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. వాగులో నీటి ప్రవాహం ఉధృతం కావడంతో మోత్కూరు, అంబాల, వంగాల, కొండగడప, సదర్శాపురం, చిన్నపడిశాల, జానకిపురం, కోటమర్తి, ధర్మారం, లక్ష్మీదేవికాల్వ గ్రామాల రైతులు బిక్కేరు వాగులో సాగు నీటి కోసం అమర్చుకున్న పంపుసెట్లు, మోటార్లు, స్టార్టర్లు, వాగుల్లో ఏర్పాటుచేసిన పైపులు తీసి బయటపెట్టారు. మోత్కూరు బృందావన్ కాల్వ ద్వారా మోత్కూరు పెద్ద చెరువులోకి నీరు వచ్చిచేరుతోంది. చెరువు నుంచి బృందావన్ కాల్వ ద్వారా ఇంగీసమ్మ కుంటలోకి నీరు వెళ్తోంది. అది నిండగానే కొండగడప జంట చెరువులకు నీరు వెళ్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, మోత్కూరు చెరువు నుంచి ఇంగీసమ్మ కుంటలోకి నీరు వెళ్లే బృందావన్ కాల్వలో జమ్ము పెరిగడంతోపాటు చెత్తాచెదారంతో నిండింది. దీంతో నీరు సాఫీగా దిగువకు వెళ్లడంలేదు. ప్రతీ రెండేళ్లకోసారైనా కాల్వలు శుభ్రం చేయించి నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



ఆలేరులో ఓ ఇంట్లోకి చేరిన నీరు

నిద్రలేని రాత్రులు గడిపాం

కుండపోత వర్షం కారణంగా మా కాలనీ అంతా వరదతో నిండిపోయింది. ఇన్ని నీళ్లు వస్తాయని అనుకోలేదు. ఇళ్లలోని నీరు చేరడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. నిత్యావసర వస్తువులన్నీ తడిసి ముద్దయ్యా యి. నాలాలు సరిగా లేక నిద్రలేని రాత్రులు గడిపాం.

-తోట రాధ, బాధితురాలు ఆలేరు

వస్తున్నారు.. చూసిపోతున్నారు



వర్షం కారణంగా కాలనీలోని పలు ఇళ్లలోకి మోకాళ్ల లోతు వరద వచ్చి చేరింది. ఇలా జరిగినప్పుడు నాయకులు, అధికారులు వస్తున్నారు.. చూసిపోతున్నారే తప్ప దీనికి కారణమైన పనులను చేపట్టడం లేదు. నాలాలు కబ్జాకు గురికాకుండా చూడాలి.

-జింకల విజయలక్ష్మి, ఆలేరు

సహాయక చర్యలు చేపట్టాం



ఆలేరులో కుండపోత వర్షం కురిసింది. జలమయమైన ప్రాంతాలను రాత్రికి రాత్రే సందర్శించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాం. ఎస్‌బీఆర్‌ఎఫ్ సిబ్బంది కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

-శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, ఆలేరు



ఆలేరులో పరిస్థితిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



ఇంట్లో నీటిని ఎత్తిపోస్తున్న కుటుంబ సభ్యులు



మోత్కూరు: బిక్కేరువాగు ఉధృతి

నాగిరెడ్డిపల్లి కల్వర్టుపై రాకపోకలు షురూ



కల్వర్టును పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శోభారాణి

భువనగిరి రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): భువనగిరి-చిట్యాల ప్రధాన రహదారి మధ్యలో మండలంలోని నాగిరెడ్డిపల్లి లో లెవల్ కల్వర్టు వద్ద వరద నీరు నిలిచిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. వరద తగ్గడంతో శుక్రవారం ఉదయం నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో వరద నీరు భారీగా ప్రవహించడంతో కల్వర్టు పై నుంచి వెళ్లేందుకు గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్ల వారు జాము వరకు ఇరువైపుల వాహనాదారులు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు , రెవెన్యూ అధికారులు బారి కేడ్లు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం వరద ఉధృతి తగ్గడంతో ఇరువైపుల రాకపోకలు కొనసాగాయి. జిల్లా పరిషత్ సీఈవో ఎన్ శోభారాణి లో లెవల్ కల్వర్టును పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి దాసరి పద్మారెడ్డి ఉన్నారు. అనంతరం నాగిరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ ఉన్నారు.

డబుల్‌బెడ్ రూం ఇళ్లను కేటాయించాలి

బీబీనగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నిర్మాణం పూర్తి చేసుకుని నిరుపయోగంగా మారిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను రెండు మూడు రోజుల్లో పేదలకు కేటాయించకపోతే ప్రజలతో కలిసి తామే ఆక్రమిస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం బీబీనగర్ మండలం కొండమడుగులో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పేదలతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, నాయకులు భిక్షపతి, పాండు, బాలయ్య, అశోక్, సుధ, అరుణ జ్యోతి, లావణ్య, వరలక్ష్మి, మంగమ్మ పాల్గొన్నారు.

అంగడి బజారు విస్తరణకు మార్కింగ్



మార్కింగ్ ఇస్తున్న మునిసిపల్ సిబ్బంది

మోత్కూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో పాత బస్టాండు నుంచి అంగడి వరకు అంగడి బజారును వెడల్పు చేయనున్నామని మునిసిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన సిబ్బందితో అంగడి బజారు 24 అడుగుల వెడల్పు ఉండేలా మార్కింగ్ చేయించారు. పాత బస్టాండు నుంచి అంగడి వరకు బజారు వెడల్పు చేసినట్టయితే మెయిన్ రోడ్డులో ఏవైనా ఇబ్బందులు తలెత్తినప్పుడు ట్రాఫిక్‌ను అంగడి బజారు మీదుగా మళ్లించవచ్చంటున్నారు. బజారు వెడల్పు చేసిన తర్వాత రోడ్డు సీసీ చేస్తామన్నారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి, రవాణా సౌకర్యం మెరుగు పడటానికి పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

గీత కార్మికులకు పింఛన్ రూ.4వేలకు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న జయరాములు

తుర్కపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు పింఛన్ 4వేలకు పెంచి ఇవ్వాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు బొలగాని జయరాములు అన్నారు. మండల కేంద్రంలోని రంగ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన కల్లు గీత కార్మిక సంఘం పదో మండల సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాగిర్ కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యాక్షుడు కొక్కొండ లింగయ్య, మండల అధ్యక్షుడు మారగోని శ్రీరాంమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటేశ్‌గౌడ్, నాయకులు బబ్బూరి శోభ, లింగంపల్లి విజయ్, కూరెళ్ల రాజాలు, పాముల రాజు, గడ్డమీది నిఖిల్, రామగోని వెంకటేశ్ గౌడ్, కొండెం బాల్‌రాజ్, పనగట్ల లక్ష్మణ్, నాగరాజు,లింగంపల్లి ప్రసాద్, పనగట్ల రాజనర్సయ్య, పంజాల పాండు, అల్వాల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రతిఘటిస్తామని ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేయిస్తున్న స్కోప్ సంస్థ ప్రతినిధులు

మోత్కూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు లేని ప్రపంచం ఏర్పాటు కోసం జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వారి సౌజన్యంతో స్కోప్ సంస్థ శుక్రవారం మోత్కూరు మసీద్ వద్ద ముస్లిం పెద్దలతో బాల్య వివాహాలను ప్రతిఘటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా స్కోప్ సంస్థ మండల కోఆర్డినేటర్ కుర్మేటి యాదయ్య మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 14 వరకు హిందూ దేవాలయాలు, మసీదులు, చర్చీల్లో పెద్దల చేత ప్రతిజ్ఞ చేయించే కార్యక్రమం చేపట్టామన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్టు ఎవరి దృష్టికి వచ్చినా టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 100, 112 కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎండి.ఖాజామియా, మజీద్, ఖాసిం, మహమ్మద్ అలీ, సలీం, ఖురేషి, అజీమ్, చాంద్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులను నమోదు చేయాలి

తుర్కపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఎస్‌హెచ్‌వీఆర్(స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్) యాప్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న అన్ని మౌలిక వసతులను నమోదు చేయాలని ఎంఈవో వీరజాల మాలతి కోరారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం 2025 - 2026 సంవత్సరానికిగాను ఎస్‌హెచ్‌వీఆర్ యాప్ పై మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ యాప్‌ను ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు అమలు చేస్తున్న మౌలిక వసతులకు సంబంధించిన అన్ని ఫోటోలను యాప్‌లో నమోదు చేసి మండలాన్ని జిల్లాలోనే ముందంజలో ఉండేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. మండలం నుంచి అప్లోడ్ చేసిన పాఠశాలలను జిల్లా స్థాయిలో ఎంపిక చేస్తారని, జిల్లా స్థాయిలో ఎంపికైనా పాఠశాలలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాపెల్లి శ్రీనివాస్, సీహెచ్ స్వరూపారాణి, బాలమణి, కే. రవీందర్‌నాయక్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చౌటుప్పల్ అధ్యక్షుడుగా బీమిడి మోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. స్థానిక సంఘం భవనంలో శుక్రవారం ఎన్నికలను నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా కానుగుల వెంకటయ్య, ఆర్థిక కార్యదర్శిగా బడుగు శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా ఎండీ. రజాక్, ఎన్. కిష్టయ్య, ఎన్.నాగమణి, సహాయ కార్యదర్శిగా సీహెచ్ వీరయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.బిక్కు, ప్రచార కార్యదర్శిగా వి.కిషోర్, జిల్లా కౌన్సిలర్‌గా కే.గీతాంజలి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ చేత విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి

రాజాపేట, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): గ్రామ సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం రాజాపేట మండలం కాల్వపల్లి గ్రామస్థులు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఇన్నారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలో పారిశుధ్యం లోపించిందని, వీధి దీపాలు నెలల తరబడి వెలుగడం లేదని తెలిపారు. గ్రామ కార్యదర్శి ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని గ్రామస్థులు వినతి పత్రంలో పేర్కొన్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఏచూరి మరణం ప్రపంచ రాజకీయాలకు లోటు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

భువనగిరి గంజ్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : సీతారాం ఏచూరి మరణం యావత్ ప్రపంచ రాజకీయాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సామ్రాజ్యవాదం సవాళ్లు అనే అంశంపై కల్లూరి మల్లేషం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే విద్యార్థి ఉద్యమంపై ఆసక్తి పెంచుకుని ప్రజా ఉద్యమాల వైపు తన అడుగులు వేస్తూ దేశంలో పెరిగిపోతున్న మతోన్మాదం కులం సామ్రాజ్యవాదంపై నిరంతర పోరాటాలు చేయడంలో ముందన్నారని, వారికి నిజమైన నివాళి అర్పించడం అంటే సామ్రాజ్యవాదంపై తిరుగులేని పోరాటం చేయడం తప్ప మరొకటి కాదని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం దేశంలో యువత పోరాటాల్లోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాచకొండ జనార్దన్, బర్రె జహంగీర్, బట్టు రాంచంద్రయ్య, కొండమడుగు నరసింహ, కుమార్, మల్లారెడ్డి, సుదర్శన్, రామకృష్ణ, ప్రకాష్, చిన్నయ్య, శ్రీనివాస్, కృష్ణ, అంజయ్య, నరసింహ, ముత్యాలు, రాజు పాల్గొన్నారు.

ఆలేరు: పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేషం, జిల్లా నాయకులు ఎంఏ ఎక్బాల్, దూపటి వెంకటేష్, మురిగాడి చంద్రశేఖర్, రమేష్, జూకంటి పౌలు, తులసయ్య, బాలరాజు, మల్లేశం, తిక్క గణేష్, యాదగిరి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో సీపీఎం మండల కార్యదర్శి వి.బిక్షం, నాయకులు రచ్చ గోవర్ధన్, చెరకు మల్లేష్, పి.బాలనర్సయ్య, ఏ.మహేష్, రామచంద్రయ్య, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు : పట్టణంలో సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు బొల్లు యాదగిరి, నాయకులు రాచకొండ రాములమ్మ, నాయకులు కూరెల్ల నర్సింహ, ఎస్‌కె.శ్రీను, గుండు లక్ష్మీ, కళ్యాణి, శోభ, బాలమణి, సావిత్రి, హుస్సేన్, బుచ్చయ్య పాల్గొన్నారు.

రామన్నపేట: పట్టణంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య, నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం, కందుల హనుమంతు, కల్లూరి నగేష్, ఎండీ.రషీద్, ఆవనగంటి నగేష్, శానగొండ రామచంద్రం పాల్గొన్నారు.

'రావి' విగ్రహావిష్కరణకు ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆహ్వాన పత్రాలు

భువనగిరి రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత ఉత్తమ పార్లమెంటేరియల్ రావి నారాయణరెడ్డి కాంస్య విగ్రహ ఆవిష్కరణకు హాజరు కావాలని రావి నారాయణరెడ్డి సేవా సంస్థ ప్రతినిధులు శుక్రవారం ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసారు. ఈనెల 17న రావి స్వగ్రామమైన మండలంలోని బొల్లేపల్లిలో కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలను అందచేశారు. ఏఎంసీ చైర్మన్ రేఖ బాబురావు, ప్రతినిధులు చెర్కుపల్లి శ్రీనివాస్, సుఖేశ్‌రెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రాజాపేట,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరుకు చెందిన కూతురు స్వామి మృతి చెందగా ఆయన కుటుంబానికి కె.కె.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రామచంద్రారెడ్డి ఆర్థిక సాయాన్ని అందజేశారు.

కట్కూరి దంపతుల పోరాటం స్ఫూర్తిదాయకం



ఆలేరు: కట్కూరి దంపతుల విగ్రహాలకు పూలువేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆలేరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ యోధులు కట్కూరి రామచంద్రారెడ్డి, సుశీలాదేవి దంపతుల పోరాటం స్ఫూర్తిదాయకమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చక్క వెంకటేష్ అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో ఆలేరులో శుక్రవారం సాయుధ పోరాట వార్షికోత్సవాలు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సాయుధ పోరాటంలో కట్కూరి రామచంద్రారెడ్డి సుశీలాదేవి దంపతుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. సాయుధ రైతాంగ పోరాటం ద్వారా పేదలకు వేలాది ఎకరాల భూములు పంపిణీ జరిగిందని, భూస్వాముల వద్ద వెట్టి చాకిరి చేసిన కార్మికులకు విముక్తి కలిందన్నారు. దేవి దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, నాయకులు అంజనేయులు, రవి, మాటూరి జానమ్మ, సీతనర్సయ్య, చంద్రయ్య, ఓదయ్య, వెంకటయ్య, యాకుబ్, నర్సింహతపాల్గొన్నారు.

రామన్నపేట: సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లిలో తెలంగాణ సాయుధ పోరాట విప్లవ సేనాని రావి నారాయణరెడ్డి స్తూపం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, సిపిఐ సీనియర్ నాయకులు బాలగోని మల్లయ్య, గంగాపురం వెంకటయ్య, గాలయ్య, ఊట్కూరి కృష్ణ, పెండెం రవీందర్, ఏనూతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

రాజాపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలం రఘునాథపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భువనగిరి రోటరీ క్లబ్ సౌజన్యంతో క్లబ్ సభ్యులు సింగబోయిన నరసింహ యాదవ్ సహకారంతో విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుపై దృష్టిని సారించి ఉన్నతంగా ఎదుగాలని మండల విద్యాధికారి చందా రమేశ్ కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు ఆగేశ్వర్‌రావు, సెక్రటరి వెంకటనారాయణ, ప్రధానోపాధ్యాయులు మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

కృష్ణవేణి విద్యార్థికి ప్రథమ బహుమతి

రామన్నపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన నేషనల్ సైన్స్ సెమినార్‌లో మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి రిమ్‌షా సదాఫ్ జిల్లా స్థాయి ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ సైన్స్ సెమినార్‌లో జిల్లా వ్యాప్తంగా 24 పాఠశాలలు పాల్గొనగా రామన్నపేట క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి రిమ్‌షా సదాఫ్ జిల్లా స్థాయి ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ ప్రకటించినట్లు ఆయన తెలిపారు. జిల్లా స్థాయి సెమినార్‌లో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థి రిమ్‌షాను గైడ్ టీచర్ పి.మురళిని పాఠశాల ప్రిన్సిపాల్ బి.యాదగిరి అకాడమిక్ డైరక్టర్ జె.మణి, పాఠశాల ఉపాధ్యాయులు రషీద్, శ్రీనివాస్, మల్లేష్, అలీం, ప్రవీణ్, పూనం దాస్, ఉమారాణి, లక్ష్మీదేవి, మహాలక్ష్మి అభినందించారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడిగా రవీందర్

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ భూదాన్‌పోచంపల్లి మండల నూతన కార్యవర్గాన్ని సభ్యులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా వై.రవీందర్, కార్యదర్శిగా జె.వెంకటేశం, ఫైనాన్స్ సెక్రటరీగా పి.సత్తిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జి.సుదర్శన్, ఉపాధ్యక్షులుగా ఎం కృష్ణారెడ్డి, ఆర్.ప్రభావతి, జాయింట్ సెక్రటరీగా వీఎల్ నరసింహారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీహెచ్ అండాలు, పబ్లిసిటీ సెక్రటరీగా జె.సుదర్శనం ఎన్నికయ్యారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ

మోత్కూరు, సెప్టెంబరు 12: మోత్కూరులో ఈ నెల 11న జరిగిన బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల 4వ మహాసభలో మండల నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొంపల్లి గంగయ్య, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె.శ్రీను, కుర్మేటి సైదులు, అంజయ్య, రాంపాక నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా కూరెల్ల నర్సింహ, సహాయ కార్యదర్శులుగా సత్తయ్య, జె.ఉప్పలయ్య ఎన్నికయ్యారు.

స్పెషల్ టీచర్లను నియమించేందుకు చర్యలు తీసుకోవాలి

వలిగొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాల స్పెషల్ టీచర్లను నియమించేందు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల విద్యాశాఖ అధికారులకు ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

పత్తిరైతుల్లో గుబులు

(3వపేజీ తరువాయి)

18 ఎకరాల్లో వరి నష్టం వాటిల్లినట్టు అధికారులు తేల్చారు. అయితే ప్రస్తుత వర్షాలతో పత్తి కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

59.8మి.మీ వర్షపాతం నమోదు

జిల్లాలో భారీతో పాటు ఓ మెస్తారు వర్షాలు కురుస్తున్నాయి. గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు 59.8మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మోటకొండూరు మండలంలో 157.2మి.మీ, ఆలేరులో 156.2మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా వలిగొండ మండలంలో 16.4మి.మీ వర్షపాతం నమోదైంది.

పత్తి దెబ్బతింటోంది



అధికంగా వర్షాలకు పత్తి పంటలు దెబ్బతిన్నాయి. పంటలకు తెగులు సోకి పత్తికాయలు కాసే సమయంలో వాడి పోయి రాలిపోతున్నాయి. నేను మూడు ఎకరాలు సాగు చేయగా, రూ.2లక్షలకుపైగా పెట్టుబడి పెట్టా. వర్షాల కారణంగా పంట దెబ్బతిని కూలీల ఖర్చులు కూడా వెళ్లే స్థితి లేదు. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

-రేగు వెంకటేష్, రైతు, వీరవెల్లి

గొర్రెలకు ప్రమాద బీమా ఇవ్వాలి

భువనగిరి రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి దయ్యాల నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ముస్యాలపల్లి గ్రామంలో గురువారం రాత్రి కారు ఢీకొట్టిన ప్రమాదంలో 15గొర్రెలు మృతి చెందగా మరో 10 గొర్రెలు గాయాలపాలయ్యాయి. దీంతో బాధితుడు బీరప్ప కుటుంబం ఆర్థికంగా నష్టపోయాడని, వెంటనే ప్రమాదబీమా కింద రూ.2.20లక్షలను పరిహారం కింద ఇప్పించాలన్నారు. ఆయన వెంట మండల కార్యదర్శి పాక జహంగీర్, జమదగ్ని, రమేశ్, అంజయ్య ఉన్నారు.

గోసంరక్షణ అందరి బాధ్యత

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు గో సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని గోసంరక్షణ సమితి జిల్లా ప్రముఖ్ బల్ల దూర్వాసులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలవిద్యార్థులకు గోవు పర్యావరణ పరిరక్షణ శాస్త్రీయ విజ్ఞానం గో విజ్ఞాన పరీక్షలు పుస్తకాలను పంపిణీ చేశారు. అయితే పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మొదటి బహుమతి తెలంగాణ రాష్ట్రంకు ఒక లక్ష రూపాయలు, జిల్లాకు రూ.50వేలు, మండలానికి రూ.25వేలు చొప్పున బహుమతులు ప్రకటించారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు కటకం తుకారాం, బజరంగ్‌దళ్ పట్టణ అధ్యక్షుడు దోర్నాల సతీష్, బడుగు మహేష్, పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

రాజాపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వపల్లి వాగు వద్ద రోడ్డు కల్వర్టు దెబ్బతినడంతో శుక్రవారం కాంగ్రెస్ మండల నాయకులు బుడిగే పెంటయ్య మరమ్మత్తులు నిర్వహించారు. తెగిన కల్వర్టు వద్ద మట్టిని పోసి చదును చేశారు. రాజాపేట నుంచి యాదగిరిగుట్ట వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేశారు. నాయకులు చిల్వేరు బాలరాజు, మహేందర్‌గౌడ్, నరేష్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఏఎంసీ మడిగెల కేటాయింపు

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని 6 వ్యాపార మడిగెల ను శుక్రవారం బహిరంగ వేలం పాట ద్వారా కేటాయించారు. 6 మడిగెల కేటాయింపుతో నెలకు రూ. 69,950-00 ఆదాయం లభిస్తుంది. ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, డీఎంవో ఎ.సబిత పాల్గొన్నారు.